మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి



బాచుపల్లి రేణుకాఎల్లమ్మ కాలనీలో పర్యటిస్తున్న మేయర్ నీలారెడ్డి, కాంగ్రెస్ నాయకులు హన్మంతరెడ్డి, భూపతిరెడ్డి

నిజాంపేట్: భవనం రిటర్నింగ్ గోడ కూలీలు ఉంటున్న షెడ్డుపై పడి ఏడుగురు కార్మికులు మృతి చెందడం దురదృష్టకరమని... ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం బాచుపల్లిలోని రేణుకాఎల్లమ్మ కాలనీలో ఘటన జరిగిన ప్రాంతాన్ని మేయర్ సందర్శించి మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ... వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆమె వెంట కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, పార్టీ ఎన్నికల అబ్జర్వర్ శోభారాణి, నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, కోలన్ వీరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కూలీల మృతికి కారణం భవన యాజమాన్యం నిర్లక్ష్యమే..

నిజాంపేట్: బాచుపల్లి రేణుకాఎల్లమ్మ కాలనీలో రిటైనింగ్ వాల్ కూలి కార్మికుల మృతి చెందడానికి భవన యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఘటనా స్థలాన్ని సీఐటీయూ బాచుపల్లి మండల సీఐటీయూ కమిటీ సభ్యులు సందర్శించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పొట్టకూటి కోసం వలస వచ్చిన ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

నాడు నిజాంపేట్.. నేడు బాచుపల్లి!

నిర్మాణ కార్మికులకు భద్రత ఏది?

- కూలీ కోసం వచ్చి ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు
- ప్రమాదం జరిగితే లేబర్ కాంట్రాక్టర్లపై నెట్టేస్తున్న నిర్మాణ సంస్థలు



నిజాంపేట్: బహుళ అంతస్తుల నిర్మాణాల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. హెచ్‌ఎండీఏ, హైరైజ్ అపార్ట్‌మెంట్లు నిర్మాణం చేసే సమయంలో... రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అనే అంశాలను అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం అనుమతులు ఉన్నాయా? లేదా? అనేది మాత్రమే తెలుసుకొని గాలికి వదిలేస్తున్నారు. నగర వ్యాప్తంగా వేలాది నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిలో లక్షలాది మంది కార్మికులు పని చేస్తున్నారు.



మృతులు శంకట్ గౌడ్, శ్రీపాటి మాజీ, బిదేశ్, రామ్ యాదవ్, గీతా బాల్ (ఫైల్‌ఫొటోలు)

వెలుగులోకి రాని ఘటనలెన్నో..?

- కార్మికుల భద్రత ప్రమాణాలను నిర్మాణ సంస్థలు ఏ మేరకు పాటిస్తున్నాయనే విషయాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా భవన నిర్మాణ పనులు చేస్తున్నప్పుడు సైతం కార్మికులు అనేక మంది చనిపోతున్న వారికి నిర్మాణ సంస్థలు అండగా నిలవకుండా వారి కుటుంబాలను ఆదుకోకుండా కేవలం లేబర్ కాంట్రాక్టర్లపైనే నెట్టివేయడంతో కార్మికుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇలాంటి సంఘటనలు కనీసం వెలుగులోకి సైతం రాకపోవడం విచారకరం.

అధికారులు పర్యవేక్షిస్తే ఇలాంటివి జరగవు..

- పని చేస్తున్న కార్మికులు నివాసం ఉంటున్న ప్రాంతాలు ఏమైన ప్రమాదకరంగా ఉన్నాయా? లేదా? అని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులే చెబుతున్నారు. బాచుపల్లిలో జరిగిన సంఘటన లాంటివి జరిగినప్పుడు మాత్రమే పర్యవేక్షించే అధికారులు మిగత సమయాల్లో తమకు పట్టనట్లుగా ఉంటున్నారు. ముందస్తుగా పర్యవేక్షిస్తే ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువ అవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొస్తున్న వైనం..

- వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న భవన నిర్మాణ కార్మికులకు, సెంట్రింగ్ కార్మికులకు ఇక్కడితో పోల్చితే తక్కువగా వేతనం ఇస్తారు. అంతే కాకుండా ఏదైన అనుకొని ప్రమాదాలు జరిగితే రిస్క్ ఉండదు. అంత లేబర్ కాంట్రాక్టర్‌లే చూసుకుంటారనే ధోరణిలో బిల్డర్లు ఉన్నారు. దీంతో కార్మికుల నివాసాలు ఉండే ప్రాంతాల్లో కనీసం పరిసరాలు పరిశుభ్రంగా ఉండవు. రక్షణ ఉండదు. మరుగుదొడ్లు సక్రమంగా ఉండవు. అధికారుల పర్యవేక్షణ వైఫల్యంతో బిల్డర్లు కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారు.

సెట్ బ్యాక్ లేకుండానే నిర్మాణాలు

- పలు కాలనీల్లో అయితే ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండానే నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. ఇలాంటి వాటిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా భవన నిర్మాణాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండే ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కావు.

హెచ్‌ఎండీఏ నిర్మాణాలపై పర్యావేక్షణ కరువు....

- హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకుని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో, గ్రామ పంచాయితీల్లో నిర్మాణాలు చేపడుతున్న వాటిపై స్థానిక అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకున్నప్పటికీ స్థానికంగా వాటిని పర్యావేక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం.

2007లో ఇదే తరహా ఘటనలో 10 మంది మృతి

2007వ సంవత్సరంలో నిజాంపేట్‌లో జర్నలిస్టు కాలనీ పక్కనే ఉన్న ఓ గేటెడ్ కమ్యూనిటీ రిటైరింగ్ వాల్ దసరా రోజు కూలింది. సాయంత్రం 6 గంటల సమయంలో భారీ వర్షం కురవడంతో సుమారు 20 అడుతుల ఎత్తున ఉన్న ప్రహరీ కూలీ సుమారు 10 మంది వరకు కూలీలు మృతి చెందారు. ప్రస్తుతం బాచుపల్లిలో సైతం ప్రహరీ కూలి మంగళవారం రాత్రి 7 మంది కూలీలు మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్న అధికారులు పునరావృత్తం కాకుండా చేపట్టాల్సిన చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. నిర్మాణ సంస్థలను పూర్తిస్థాయిలో విచారణ చేసి ఏమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయా? లేదా అనే విషయాలను పరిగణలోకి తీసుకుని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైన అధికారులు నిర్మాణాలపై పూర్తి స్థాయి విచారణ చేపడితే బాగుంటుంది.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ



వై-జంక్షన్‌లో చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలుపుతున్న పబ్బతి శ్రీకృష్ణ

కూకట్‌పల్లి: దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం కూకట్‌పల్లి వై-జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలిపారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నీ గుజరాత్ వ్యాపారులకు అమ్మేశారిని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు లేకుండా చేసి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. అందుకే మోదీ ప్రభుత్వానికి ఓట్ల ద్వారా బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. గత పదేళ్లుగా బీజేపీ దేశ ప్రజలకిచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.శంకర్, బి.వీరన్న, బి.వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరే జీవనాధారం

కాపాడుకోవడం మనందరి బాధ్యత

సుభాష్‌నగర్: వర్షపు నీరే జీవనాధారం... కాపాడుకోవడం మనందరి బాధ్యతని పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. ప్రచార వాహనంతో నీటి ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన హైదరాబాద్ నగరం మరో బెంగుళూరు కావద్దనే ఉద్దేశంతో ప్రజలను జాగృతం చేయడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే.. చెరువుల్లోకి వర్షపునీరు చేరలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. నీటిని సంరక్షించకుంటే రాబోయే రోజుల్లో ఇళ్లల్లో నీటి దొంగతనాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఆ పరిస్థితి తలెత్తకుండా ఇప్పుడు మేల్కొనాలని కోరారు.



వర్షపు నీటిపై అవగాహన కల్పించే ప్రత్యేక ప్రచార వాహనంతో రవీందర్ ముదిరాజ్

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

జీడిమెట్ల: అపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ కర్తవ్యమని 'మేము సైతం మీకోసం'ఫౌండేషన్ చైర్మన్ కట్టిబోయిన శివకుమార్ అన్నారు. నల్గొండ జిల్లా పారేపల్లిగూడేం గ్రామానికి చెందిన నర్రా శివకుమార్ 11రోజుల క్రితం బైక్ యాక్సిడెంట్‌లో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గాజులరామారానికి చెందిన ఫౌండేషన్ సభ్యులు, ఆపద్బాంధువు ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ.16వేలు నర్రాశివకుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. అదేవిదంగా మరియు గోకుల్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ చెరువుపల్లి విద్యాసాగర్ శివకుమార్ పిల్లల చదువులకు కావాల్సిన ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. ఆపద్బాంధువు ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశి, ఉపాధ్యక్షుడు గణేష్, జక్కల స్వప్న, బాజాఅరుస్, రామోజు శ్రీకాంత్, దూదిమెట్ల సాయి, శ్రవణ్‌కుమార్ గురజాల కిరణ్ తదితరులు ఉన్నారు.

'ఒక్క వర్షానికే సెల్లార్లు నిండిపోయాయి'

వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఆందోళనలో స్థానికులు

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో మంగళవారం కురిసిన భారీ వర్షంతో వరదనీరు చేరింది. చాలా భవనాల్లో మోటార్ల ద్వారా నీటిని బయటకు తోడారు. ఇంకా పలు భవనాల సెల్లార్లలో వరదనీరు అలాగే ఉంది. వాతావరణ శాఖ అధికారులు మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని ప్రకటించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



అదుపు తప్పి కారు పల్టీ

తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రికి తరలింపు



కుత్బుల్లాపూర్: కారు బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దూలపల్లి నుంచి గండిమైసమ్మకు వెళ్తున్న బ్రెజా కారు (టీఎస్07హెచ్‌క్యూ 2403) మార్గమధ్యంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న తరుణ్ తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని నగరంలోని యశోదా ఆస్పత్రికి తరలించారు. కాగా కారులో కూర్చున్న గౌతమి స్వల్ప గాయాలతో బయట పడింది. కారును అతివేగంగా నడపటడం వల్లే అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో తల్లీకూతురు అదృశ్యం

సుభాష్‌నగర్: అనుమానాస్పదస్థితిలో తల్లీకూతురు అదృశ్యమైన ఘటన సూరారం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీ మరాఠీ బస్తీకి చెందిన శ్రీను, శిరీష (27)లు భార్యాభర్తలు. వీరికి లేఖశ్రీ(07) కుమార్తె ఉంది. ఈనెల 6న డ్యూటీకి వెళ్లిన శిరీష కుమార్తె లేఖశ్రీ పుట్టిన రోజు ఉండటంతో తన వెంట తీసుకువెళ్లింది. అయితే కార్యాలయంలో కళ్లు తిరిగి పడిపోయాయని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని మరుసటి రోజు సాయంత్రం వరకు ఇంటికి వస్తానని శిరీష ఫోన్‌లో భర్తకు తెలిపింది. అయినా భార్య, కూతురు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన శ్రీను ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కార్యాలయంలో, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శిరీష, లేఖశ్రీ (ఫైల్)

విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనపై చర్యలు తీసుకోవాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి

చింతల్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు సంబంధించి జాతీయ ఉపాధ్యాయ మండలి పంపిన వివరణ లేఖను వెల్లడించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి టెట్ అవసరం లేదన్నారు. పాఠశాల స్థాయి మారిన సందర్భంలో మాత్రమే ఇది అవసరమని ఏప్రిల్ 8న ఎన్సీటీఈ రాష్ట్రానికి వివరణ ఇచ్చిందని పేర్కొన్నారు.

- ఈనెల 3న ఢిల్లీలో ఎన్సీటీఈ మెంబర్ సెక్రటరీ శెర్వాతో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూఎస్పీసీ, జాక్టో ప్రతినిధులు సమావేశమైనప్పుడు ఏప్రిల్ 8నే పాఠశాల విద్యా కమిషనర్‌కు మెయిల్ ద్వారా వివరణ లేఖ పంపినట్లు తెలిసిందన్నారు. ఆ వివరాలు వెల్లడించకుండా ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేసిన శ్రీదేవసేన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.
- స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు ఎన్సీటీఈ నిబంధనలు పాటించాలని గత సెప్టెంబరు 29న హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా అన్ని కేడర్ల పదోన్నతులు నిలిపివేశారన్నారు. ఏ క్యాడర్ పదోన్నతులకు 'టెట్'అవసరమో ఎన్సీటీఈ నుంచి వివరణ తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు అభ్యర్థించిన మీదట ఫిబ్రవరి 14న విద్యాశాఖ కమిషనర్ లేఖ రాశారని వివరించారు.
- ఎన్సీటీఈ ప్రత్యుత్తరం విషయం తెలియక ఏప్రిల్ 20 వరకే గడువు ఉండటంతో టెట్‌కు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారన్నారు. మరికొన్ని అంశాలపై వివరణ తీసుకొని, ఎన్నికలు ముగిసిన వెంటనే పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు 26 కులాల బీసీ జేఏసీ మద్దతు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న 26 బీసీ కులాల జేఏసీ నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 26 కులాల బీసీ జేఏసీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది. బుధవారం గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జేఏసీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనతో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించి కేసీఆర్ తమకు తీరని ద్రోహం చేశారన్నారు. దీంతో తమకు ప్రభుత్వ పరంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసంతో ఉన్నామని పేర్కొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామన్నారు. పేద బడుగు బలహీనవర్గాల మనుగడ సాగాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని తెలిపారు. తొలగించిన 26 బీసీ కులాలను తిరిగి బీసీ జాబితాలో సీఎం రేవంత్‌రెడ్డి చేర్చి తమకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

- ఏఐసీసీ అబ్జర్వర్ సిన్నమలై జ్యోతిమణి

కుత్బుల్లాపూర్: తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఐసీసీ అబ్జర్వర్, తమిళనాడు ఎంపీ సిన్నమలై జ్యోతిమణి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ కమిటీ సన్నాహక సమావేశాన్ని గాజులరామారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతిమణి మాట్లాడారు. దేశంలో బీజేపీ పని అయిపోయిందన్నారు. యువ నాయకుడు రాహుల్‌గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రచారాన్ని వేగవంతం చేయాలన్నారు. – అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ కో-ఆర్డినేటర్ శోభారాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, జోత్స్నారెడ్డి, సాంరెడ్డి పున్నారెడ్డి, మాజీ జడ్పీవైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు, లక్ష్మారెడ్డి, బొడ్డు వెంకటేశ్వరరావు, దమ్మని శ్రవణ్, గుంజ శ్రీనివాస్, బండి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ సిన్నమలై జ్యోతిమణి



జ్యోతిమణిని సత్కరిస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకుని బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. జగద్గిరిగుట్ట కొండపై వేంచేసిన శ్రీకాళికామాత ఆలయం, జగద్గిరిగుట బస్టాండ్ సమీపంలోని శ్రీదుర్గామాత ఆలయం, మగ్దూమ్‌నగర్‌లో బొడ్రాయికి పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.